



నులి పురుగుల నివారణ మాత్రలు వేసుకుంటున్న విద్యార్థిని పరీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు


నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. వీటికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించరని అధికారులు చెబుతున్నారు..

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. వీటి కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఏడాది కూడా ఉమ్మడి కర్నూలు జిల్లా ఆధారంగా ఇంటర్ పరీక్షలను నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. కర్నూలు జిల్లాలో మొత్తం 73 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 23,610 మంది ప్రథమ సంవత్సర విద్యార్థులు, 26,057 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. నంద్యాల జిల్లాలో మొత్తం 51 పరీక్ష కేంద్రాలు



ఏర్పాటు చేశారు. 12,178 మంది ప్రథమ సంవత్సర విద్యార్థులు, 14,792 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా పత్రాలను 44 పోలీస్ స్టేషనల్లో భద్రంగా భద్రపరిచారు. మొత్తం 17 పరీక్ష కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించగా అందులో కర్నూలు జిల్లాలో 12 కేంద్రాలు, నంద్యాల జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. 124 పరీక్ష కేంద్రాల్లో సిసి కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. 17 రూట్లలో విద్యార్థుల సౌకర్యార్థం ఆర్‌టిసి బస్సులను నడపనున్నారు. ఉదయం 8.30 నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రంలోపలికి అనుమతిస్తారు. 9 గంటల వరకూ మాత్రమే అనుమతివ్వనున్నారు. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతించరు. పరీక్షలను పర్యవేక్షించేందుకు ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్లు, 12 సిట్టింగ్ స్క్వాడ్లను కూడా ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. పరీక్ష ముగిసిన తరువాత మధ్యాహ్నం 12 గంటలకు సమాధాన పత్రాలను సేకరించి సరైన రీతిలో ప్యాకింగ్ చేసి సంబంధిత పోస్టు ఆఫీసులకు చేరేలా చర్యలు తీసుకోనున్నారు. పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్లకు కూడా ఫోన్లను అనుమతించడం లేదు. వారికి ఇంటర్మీడియట్ బోర్డు నుంచే బేసిక్ ఫోన్లను అందజేయనున్నారు.

పొరపాట్లు లేకుండా కౌంటింగ్ నిర్వహణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియలో పొరపాట్లు జరగకుండా సమర్థవంతంగా నిర్వహించాలని స్థానిక సంస్థల మండలి ఎన్నికల రిటర్నింగ్ అధికారి , జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి కౌంటింగ్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక ఉద్యానభవన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ సిబ్బందికి జరిగిన రెండవ విడత శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం వారి ఎన్నికల నియమావళి పై రూపొందించిన మాన్యువల్‌ను క్షుణ్ణంగా చదవాలన్నారు. కర్నూలు నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్‌కు సంబంధించి ప్రతి అభ్యర్థి ఒక కౌంటింగ్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చన్నారు. కౌంటింగ్ సిబ్బంది కౌంటింగ్ సమయంలో వాలిడ్ , ఇన్ వాలిడ్ బ్యాలెట్ పేపర్‌ను జాగ్రత్తగా గమనించాలన్నారు. జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి మాట్లాడుతూ శాసనమండలి ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తూ స్థానిక సంస్థల ఓట్ల లెక్కింపుకు ఏర్పా టు చేసిన ప్రతి టేబుల్ కు సిబ్బంది ఉంటారన్నారు. కౌంటింగ్ పర్సనల్స్ కౌంటింగ్ కేంద్రంలోనికి పెన్ను ను తీసుకొని వెళ్లడానికిఅనుమతి లేదన్నారు. ఓట్ల లెక్కింపులో భాగంగా ప్రాథమికంగా మొదట పోస్టల్ బ్యాలెట్ అనంతరం బ్యాలెట్ పేపర్లను కట్టగా కట్టి పోలింగ్ స్టేషన్ల వారీ గా ట్రేలో వెయ్యాలన్నారు. తరువాత పోస్టల్ బ్యాలెట్ పేపర్లు , పోలింగ్ స్టేషన్స్ వారీగా కట్టలు కట్టిన బ్యాలెట్ పేపర్లను మొత్తం కలిపి అభ్యర్థుల వారీగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. కౌంటింగ్ మాన్యువల్ లోని ప్రతి లైన్‌ను క్షుణ్ణంగా చదివి కౌంటింగ్ పర్సనల్స్ అర్థం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలల ఆరోగ్యం దేశానికి సౌభాగ్యం : కలెక్టర్

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

బాలల ఆరోగ్యం దేశానికి సౌభాగ్యమని అందుకుగాను చిన్నారులు చిన్న నాటి నుంచి ఆరోగ్య సూత్రాలు పాటించాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ అల్బెండజోల్ మాత్రల పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన సందర్భంగా ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒక సారి ఒకటి నుండి 19 సంవత్సరాల వయసున్న పిల్లలందరూ తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలను తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, విద్యా శాఖ, ఆరోగ్యశాఖ తరపున అల్బెండజోల్ మాత్రలను అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూలు , ఇంటర్మీడియేట్ చదువుతున్నా, స్కూల్లో లేకపోయినా పిల్లలందరికీ మాత్రలను వేయడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. 14వ తేదిన ఎవరైనా పిల్లలు మిస్ అయితే వారికి మళ్ళీ ఈనెల 18నఅల్బెండజోల్ మాత్రలను వేస్తారన్నారు. బహిరంగ ప్రదేశాలలో ఆడుకునేటప్పుడు, పాదరక్షలు లేకుండా తిరగడం ద్వారా చర్మం నుంచి కూడా లార్వా లోపలికి ప్రవేశించే అవకాశం ఉంటుంద న్నారు. అందుకుగాను భోజనానికి ముందు, తరువాత 20 సెకన్ల చొప్పున చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. దీంతో చాలా వరకు నులిపురుగులు నివారణ తగ్గిపోతుందన్నారు. శరీరంలో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, విరోచనాలు, బరువు తగ్గడంతో పాటు అనేక రకాల అనారోగ్య సమస్యలు కూడా వస్తాయన్నారు. విద్యార్థులు ఈ మాత్రలు తీసుకోవడం వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదిగేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అనంతరం పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన ఎఫ్‌ఎ పరీక్ష వివరాలను పరిశీలించి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల ఇంఛార్జి ప్రధాన ఉపాధ్యాయుడు శివప్రసాద్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ రామ గిడ్డయ్య, డిఐఒ వై.ప్రవీణ్ కుమార్, ఆర్‌బిఎస్‌కె కోఆర్డినేటర్ పి.హేమలత, మెడికల్ ఆఫీసర్లు మాధవి, జి.సృజన, డెమో చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, ఆర్‌బిఎస్‌కె సిబ్బంది ఇర్ఫాన్ బాషా, పాఠశాల ఇంఛార్జి ప్రధాన ఉపాధ్యాయుడు శివ ప్రసాద్ పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను చూపుతున్న దృశ్యం

ట్రిపుల్ ఐటి డిఎంతో అత్యున్నత ఒప్పందం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు లోని స్థానిక జగన్నాథ గట్టులో ఉన్న ట్రిపుల్ ఐటి డిఎం విద్యాసంస్థ మంగళవారం అత్యున్నత ఒప్పందాన్ని చేసుకుంది. ట్రిపుల్ ఐటి డిఎం డైరెక్టర్ ప్రొఫెసర్ సోమయాజులు ఆధ్వర్యంలో ఎంపి , తెలంగాణ సెక్రటరీ జనరల్ మధ్యన ఈ అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం ఐఐటిలు, సిఎస్ఐఆర్ ల్యాబ్‌లు, పిఎస్ యులు, రాష్ట్ర కేంద్రం, ఇంటర్‌గవర్నమెంటల్ ఏజెన్సీలతో కూడా జరిగింది. రష్యాలోని ఐసిఎస్‌టిఐ మాస్కో మంత్రిత్వ శాఖ కార్యాలయం నుండి 2045 యు యెన్ విజన్‌కు అనుగుణంగా ఒప్పందం చేసుకున్నారు. విజ్ఞాన భాగస్వామ్యాన్ని అందించడమే కాకుండా యువ విద్యార్థుల అభివృద్ధి కోసం అంతర్జాతీయ క్యారియర్ జ్ఞానానికి సంబంధించిన అంశాలపై రెండు సంస్థలు పనిచేయనున్నాయి.

అధికారుల అనాలోచిత చర్యలు

- అక్రమ కట్టడాలపై అనాలోచిత చర్యలు
- ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి
- ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకోవాలి



కూలగొట్టిన కట్టడాలను పరిశీలిస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి,

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని రామలింగేశ్వర నగర్‌లో నగరపాలక సంస్థ అనుమతితో పున్నమి రెస్టారెంట్ ప్రక్కన కాంప్లెక్స్ నిర్మించి ఆరు నెలు గడిచింది. గత నెల నుండి వివిధ పేర్లతో కాంప్లెక్స్ ముందు భాగాన్ని తొలగిస్తూ స్థానికులను మున్సిపల్ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆరు నెలల క్రితం స్థానికులు సొంత ఖర్చుతో తెలుసుకున్న సిమెంట్ రోడ్డును తవ్వేసి కొత్త రోడ్డు వేశారు. 25 ఏళ్ల క్రితం నిర్మించిన మున్సిపల్ కాలువ ఉండగానే, 6 నుండి 8 అడుగుల విస్తీర్ణంలో కాలువ తవ్వి కాంప్లెక్స్ లోకి వ్యాపారులు ప్రజలు గృహ యజమానులు వెళ్లకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి నగర నాయకులు ఎం.నాగరాజు, ఎ.వెంకటేశ్వర్లు, ఎస్.నౌషాద్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నిర్మాణాలకు కూల్చిన ప్రదేశాన్ని పట్టణపౌర సంక్షేమ సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిటీ ప్లానింగ్ అధికారులు అనుమతి ఇచ్చిన కాంప్లెక్స్ పూర్తయిన ఆరు నెలలకు అక్రమ కట్టడాలు గుర్తుచ్చాయా? అని ప్రశ్నించారు. నగరపాలక సిబ్బందితో పాటు 50 ఇళ్లకు ఒక వాలంటీరు వారి పైన మరొక అధికారి ఈ రకంగా వివిధ పేర్లతో ఎంతమంది సిబ్బంది అధికారులు ఉండి అక్రమ కట్టడాలు పట్టించుకోకుండా కాంప్లెక్స్ లు పూర్తయిన తర్వాత కూల గొడుతున్నారు. ప్రభుత్వానికి అనుకూలంగా లేని వారిని అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రజల నుండి విమర్శలు వస్తున్నాయి. అధికారుల చర్యల వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరుతోపాటు ప్రజలు ఆర్థికంగా మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజాప్రతితులు చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రజలు కూడా పెట్టుకున్న డబ్బులతో నిర్మించుకున్న కట్టడాలకు రక్షణ కల్పించాలి. ఈ పర్యటనలో సంఘం నగర ప్రతినిధులు కె.శ్రీనివాసులు, ఎన్.మదిలేటి, పి.నాగరాజు, అయ్య స్వామి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ మొదటి, మూడవ ఐదవ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుండి ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షల్లో దాదాపుగా 11 మంది విద్యార్థులు మాస్ కాపీయింగ్ కు పాల్పడుతూ డీబార్ అయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 7342 మంది విద్యార్థులు హాజరు కాగా 92 శాతం హాజరు నమోదయింది. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 10997 మంది విద్యార్థులు హాజరుకాగా 91 శాతం హాజరు నమోదయింది.

డయల్ యువర్ ఎస్ఇకి 18 వినతులు

ప్రజాశక్తి-కర్నూల్ కార్పొరేషన్



డయల్ యువర్ ఎస్ఇ కార్యక్రమానికి 18 వినతులు అందాయని ఎపి ఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఎం. ఉమాపతి తెలిపారు. మంగళవారం ఎస్ఇ కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ ఎస్ఇ కార్యక్రమంలో బిల్లింగ్ కు సంబంధించి ఒకటి, కరెంట్ లైన్లకు సంబంధించి ఏడు , స్తంభాలకు సంబంధించి ఒకటి, మీటర్లకు సంబంధించి ఫిర్యాదులు రెండు, వ్యవసాయ సర్వీసులు కావాలని ఒకటి,ఇతరములు ఆరు, మొత్తం 18 వినతులు ఫోన్ ద్వారా వినియోగదారులు తెలిపారని చెప్పారు. ఆర్థికపరమైన సమస్యలు మినహా చిన్న సమస్యలను వెంటనే సంబంధిత అధికారులతో పరిష్కరిస్తామని అన్నారు.

ఎగ్జిబిషన్ గ్రౌండ్ దక్కించుకున్న కడప జిసి రెడ్డప్ప

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ మంగళవారం నిర్వహించిన వేలంపాటలో కడపకు చెందిన జిసి రెడ్డప్ప దక్కించుకున్నారు. సంవత్సరంలో 97 రోజులకు గాను రోజుకు రూ.లక్ష 11 వేల చొప్పున వేలం పాడినట్లు అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్ తెలిపారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి వేలం నిర్వహించలేదు. ఈసారి పోటీకి 9 మంది రావడంతో వేలం పాటలు నిర్వహించినట్లు తెలిపారు.

నేడు సి బెళగల్ సర్వసభ్యసమావేశం

ప్రజాశక్తి -సి బెళగల్ : సి బెళగల్ మండల అభివృద్ధిపైనా చర్చించేందుకు మండలపరిషత్ కార్యాలయంలో నేడు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిపి రాముడు పేర్కొన్నారు. అధికారులు అందరూ నివేదికలతో హాజరు కావాల్సి ఉంటుందని అన్నారు. చేసిన, చేయాల్సిన అభివృద్ధిపై నిధుల ప్రణాళికలు అంశాలంటాయని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలకు నలుగురు డిటిలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంలో నలుగురు డిప్యూటీ తాసిల్దార్లను నియమిస్తూ జిల్లా రెవిన్యూ అధికారి నాగేశ్వరరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎం.రాజేశ్వరి, సహనాజ్ , శ్రీదేవి , ఓంకార్, ప్రసాదులు ఇంటర్ పరీక్షలు పూర్తయ్యే వరకు ఫ్లయింగ్ స్క్వార్డుగా వ్యవహ రిస్తారని డిఆర్ఒ పేర్కొన్నారు.

పెండేకల్ ఆర్‌ఎస్‌లో గుర్తు తెలియని వ్యక్తి హత్య

ప్రజాశక్తి- తుగ్గలి

తుగ్గలి మండలం పరిధిలోని పెండేకల్లు ఆర్ఎస్ స్థానిక దస్తగిరి స్వామి దర్గా సమీపంలో పాత రైల్వే కొట్రస్ ఎదురుగా ఉన్న ఖాళీ రాస్తాలో గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం రాత్రి హత్యకు గురయ్యాడు. గుర్తు పట్టలేనంతగా ముఖంతో బంధారాయితో మోదారు. దీంతో ముఖం పూర్తిగా కనిపించలేని విధంగా ఉంది. ఇంతకు ఈ వ్యక్తిని ఇంతలా ఎందుకు చంపారో ఈ వ్యక్తి ఎవరో పూర్తి విషయాలు తెలియాల్సి ఉంది.

17న మున్సిపల్ కార్మికుల ధర్నా : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారానికి ఈనెల 17న కలెక్టర్ కార్యాలయం దగ్గర జరుగు మున్సిపల్ కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి .అంజిబాబు కార్మికులకు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ,మున్సిపల్ కార్మికులకు కూడా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ,ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని రిస్క్ అలవెన్సులు కూడా ఇవ్వాలని, క్యాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని పర్మనెంట్ మున్సిపల్ కార్మికులకు జిపిఎస్ అకౌంట్లు హెల్త్ కార్డులు ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం దగ్గర జరుగు ధర్నాలో కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మున్సిపల్ పట్టణాలలో మురుగునంతా శుభ్రం చేసి పట్టణ ప్రజల కనీస అవసరాలను తీరుస్తూ రాష్ట్రంలో కోటిన్నర మంది ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ పర్యావరణాన్ని పరిరక్షిస్తూ స్థానిక సంస్థలతోపాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలు సాధించి పెట్టడంలో మున్సిపల్ సిబ్బంది తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పని చేస్తున్నారని అన్నారు.శాశ్వత స్వభావం కలిగిన ప్రమాదకరమైన విధులను కాంట్రాక్ట్ కార్మికులు నిర్వహిస్తూ పారిశుధ్య విభాగంలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయకుండా పాలకవర్గాలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. సొంత ఫోన్లు ఇవ్వకుండానే చదువు లేని కార్మికుల్ని ఎవరి ఫోటోలను వారే ఎఫ్‌ఆర్ఎస్ (ఫేస్ రికగ్నేషన్ సిస్టం) తీసి పెడితేనే జీతాలు లేకుంటే లేదని వేధింపులకు గురి చేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో కాంట్రాక్టు , ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని ,సమాన పనికి సమాన వేతనం ఇస్తామని సిఎం హామీ ఇచ్చారన్నారు. గద్దెనెక్కిన తర్వాత హామీని తుంగలో తొక్కేసారని విమర్శించారు. హక్కుల సాధన కోసం జరిగే 17వ తేదీ ధర్నాలు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

ప్రధానికి రైతు సంఘం ఉల్లిగడ్డల పార్సిల్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : ఉల్లిని కర్నూలు మార్కెట్లో కిలో రూ.5 ప్రకారం అమ్మి రైతు నష్టపోతున్నారని, కేంద్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.3000 ప్రకారం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ, కర్నూలులో ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీకి ఉల్లిగడ్డలు పార్సిల్ చేశారు. ఈ పార్సిల్ వెంట అర్జీని కూడా పంపారు. ఈ కార్యక్రమానికి ఎఐటియుసి నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం మాట్లాడుతూ రాష్ట్రంలోని కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాలలో ఉల్లి పంట ఖరీఫ్, రబీ సీజన్లో విస్తారంగా పండిస్తారని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్లో ఒక్క కర్నూలు జిల్లాలోనే 50 వేల ఎకరాలలో పంట సాగు చేశారన్నారు. రాష్ట్రంలో కర్నూలు, తాడేపల్లిగూడెం ఉల్లికి పెద్ద మార్కెట్లని తెలిపారు. ఒక ఎకరాకు రూ.1,20,000 వరకు సాగు ఖర్చు అవుతాయి. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు, డీజిల్, పెట్రోల్ ధరలు, రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగాయన్నారు. ఈ సంవత్సరం రాష్ట్రంలోని మార్కెట్లో ఉల్లిని క్వింటాలుకు రూ.500 వందల ప్రకారం రైతుల నుండి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉల్లి ఎగుమతులపై ఆంక్షలు విధించడం కూడా ప్రధాన కారణమన్నారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని, ఉల్లికి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.3000 నిర్ణయించాలన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా ఉల్లిని కొనుగోలు చేసి రైతు బజార్లో,హాస్టళ్లకు, చౌక డిపోలకు సరఫరా చేయాలన్నారు.

నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-తుగ్గలి

మండల కేంద్రమైన తుగ్గలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వివిధ గ్రామాలలో వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, పగిడిరాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వివిధ గ్రామాలలో వైద్య అధికారి




నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న వైద్యులు

హారిత చిన్నారులకు నులిపురుగు నివారణ మందులను వేశారు. తుగ్గలి కెజిబివిలో , అంగడివాడి కేంద్రాలలో ఆరోగ్య కార్యదర్శి మహాలక్ష్మి చిన్నారులకు మాత్రలు వేశారు. వైద్యాధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు అంగడవాడి కేంద్రాలలో చిన్నారులకు నులిపురుగు మందులను వేస్తున్నామన్నారు. నులిపురుగుల సంక్రమణ నిరోధించడానికి ఈ మందులు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. చేతులను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని వారు కోరారు. ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యదర్శులు, అంగడివాడి వర్కర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు అవగాహన

సి బెళగల్: మండలంలోని ముడుమాల



నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న వైద్యులు

హైస్కూలులో వైద్యులు సునీత మంగళవారం విద్యార్థులకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు.మండలంలో మొదటి విడత వారోత్సవాల భాగంగా మండలంలో 9769 మంది విద్యార్థులుండగా 9365 మంది విద్యార్థులకు మాత్రలు వేసినట్లు తెలిపారు. మొత్తానికి 95.8శాతం శాతం నమోదు అయ్యిందని 100 శాతం చేయాలని సిబ్బందికి తెలిపారు.

ముస్లింలను మోసం చేసిన వైఎస్ జగన్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



మాట్లాడుతున్న ఎస్ఎ.సుభాన్

ముస్లింలను మాటలతో వైఎస్ జగన్ ప్రభుత్వం మోసం చేస్తుందని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎ. సుభాన్ అన్నారు. మంగ ళవారం ఆవాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి ముస్లిం సంఘాల ప్రతి నిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారితో ఇది మన ప్రభుత్వం మనసులో పెట్టుకోండి అనడాన్ని ముస్లిం మైనార్టీల సమస్య పరిష్కారం కంటే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లను ఆకర్షించడానికి చేసిన ప్రయత్నంలా ఉందన్నారు. ఖాజీల పదవీకాలం మూడేళ్ల నుంచి పదేళ్లకు పెంచి. వారికి కార్యాలయాలు, తగిన సిబ్బంది, ఇతర సౌకర్యాలు కల్పించకపోతే ప్రయోజనమేంటన్నారు. తక్కువ వేతనాలతో జీవితాలు దుబ్బరంగా జీవిస్తున్న మౌజన్లు, ఇమామ్‌ల గురించి సిఎం ఎందుకు మాట్లాడలేదని అన్నారు. ముస్లింల మనసులో ప్రభుత్వం ఉన్నా సిఎం మనసులో మాత్రం ముస్లింలు లేరన్నారు. ఉండి ఉంటే ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ గురించి, డైరెక్టు రుణాల గురించి చదువుతో నిమిత్తం లేకుండా దులహన్ స్కీం అమలు గురించి , ముస్లిం మైనార్టీల విదేశీ విద్యకు సంబంధించిన లోన్ల గురించి, కర్నూలులో గల డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ పూర్తి చేయడం గురించి ఎందుకు మాట్లాడ లేదో చెప్పాలని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వ్యవహారం అరచేతిలో బెల్లం పెట్టి మోచేయి నాకిచ్చేలా ఉందన్నారు. నాలుగేళ్ల నుంచి గుర్తుకు రాని ముస్లిం మైనార్టీలు ఉన్న పల్లంగా గుర్తుకు రావడమేంటని అన్నారు. మతోన్మాదులతో అంటగాగుతూ మైనార్టీ వ్యతిరేక చర్యలను ఏ ఒక్క పూట ఖండించకుండా సిఎఎ, ఎన్‌పిఆర్ లాంటి చట్టాలకు మద్దతు ఇస్తున్నారన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమాన్ని ఉద్దేశపూర్వకంగానే విస్మరించి ముస్లిం సంఘాల నాయకులతో మాట్లాడి నంత మాత్రాన రాష్ట్ర ముస్లిం మైనార్టీలు ప్రభుత్వ మోసపు మాటలను నమ్మరన్నారు. తమ హక్కుల సాధనకు ముస్లింలు చైతన్యంతో కదలాలని అన్నారు. సుభాన్‌తో పాటుఆవాజ్ ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎండి షరీఫ్ పాల్గొన్నారు.

మార్క్స్ మార్గంలో నడవాలి

ప్రజాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు బలరాం

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ప్రపంచ కార్మికులను ఏకం చేసిన ఘనత కారల్‌మార్క్స్‌కు దక్కిందని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కె. బలరాం అన్నారు. మార్క్స్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని ఆయన కోరారు. మంగళవారం నగరంలోని ప్రజా పరిరక్షణ సమితి కార్యాలయంలో కారల్ మార్క్స్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రజా పరిరక్షణ సమితి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కె. బలరాం మాట్లాడుతూ మార్క్స్ ను ఆదర్శంగా తీసుకొని అందులో కొద్దిపాటిగా కార్మిక సంఘం, కర్షక, యువత రాజకీయాల్లోకి వచ్చి మార్పునకు కషి చేయాలని కోరారు. ప్రపంచ కార్మికుల రథసారథి మార్క్స్ చరిత్రలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా పరిరక్షణ సమితి గౌరవ అధ్యక్షుడు పద్మా నంద యోగీ డేవిడ్, శ్రీరాములు పురుషోత్తం, గజపతి, రమణారెడ్డి, రవి కుమార్, రెడ్డికుమార్, రవి ప్రసాద్ తది తరులు పాల్గొన్నారు.

సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు చేయాలి

- తెలుగు రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి సి.నారాయణ రెడ్డి


మాట్లాడుతున్న సి.నారాయణరెడ్డి

ప్రజాశక్తి - ఆలూరు

పత్తిని ప్రభుత్వం సిసిఐ ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేయాలని తెలుగు రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి సి.నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆలూరు టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పత్తి గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురి అవుతున్నారన్నారు. అకాల వర్షాల వల్ల పత్తి తీవ్రంగా నష్ట పోయారని, శనగలను కూడా రైతు భరోసా కేంద్రాల్లో నామ మాత్రంగా కొనుగోలు చేస్తున్నారన్నారని అన్నారు. పూర్తి స్థాయిలో రైతులు పండించిన శనగలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా చితికిపోయిన రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఇలాగే కొనసాగితే రైతులకు సేద్యం భారంగా మారి క్రాప్ హాలిడే ప్రకటించే అవకాశం ఉందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేక ఆలూరు ప్రాంతంలో బ్రతుకు దెరువు కోసం రైతులు వలసలు వెళ్తున్నారన్నారు. వేసవి సమీపిస్తుండటంతో తాగు నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చెప్పట్టాలని ఆయన కోరారు. సమావేశంలో కుందన గుర్తి సర్పంచ్ పురుషోత్తం, టీఎన్టీయుసి జిల్లా నాయకులు నాగరాజు, పట్టణ అధ్యక్షుడు చంద్ర శేఖర్, మాజీ సర్పంచ్ వెంకటేష్, టీడీపీ నాయకులు జిలాని, తెలుగు యువత నాయకులు ఉరుకుందు,ఈరన్న పాల్గొన్నారు.

శాసన మండలి ఉప నాయకుడుగా బిటి నాయుడు



ప్రజాశక్తి - ఆదోని

శాసనమండలి ఉపనాయకుడుగా (డిప్యూటి లీడర్) బిటి నాయుడు ను తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంపిక చేశారు. ప్రస్తుతం జరుగుతున్న శాసనమండలి సమావేశాల్లో ఉప నాయకుడిగా బిటి నాయుడు వ్యవహరించనున్నారు.

వైసిపి పాలనలో రాష్ట్రం అభివృద్ధి శూన్యం

టిడిపి మాజీ ఇంచార్జ్ వైకుంఠం మల్లికార్జున చౌదరి

ప్రజాశక్తి - చిప్పగిరి

ఒక్కసారి అవకా ఇచ్చి చూడండి అని అడిగిన జగన్మోహన్ రెడ్డికి అవకాశం ఇచ్చినందుకు రాష్ట్రం అభివృద్ధిలో అన్ని రంగాలలో వెనకబడిపోయిందని ఆలూరు టిడిపి మాజీ ఇంచార్జ్ వైకుంఠం మల్లికార్జున చౌదరి అన్నారు. మంగళవారం నంచర్ల గ్రామంలో టిడిపి నాయకులు నిర్వహించిన లింగమయ్య తాత దేవర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయాలలో ఉద్యోగాలు కల్పించానని ముఖ్యమంత్రి జగన్ పదేపదే చెప్పుకుంటున్నారు. కానీ వాస్తవానికి వస్తే రాష్ట్రంలో ప్రతి శాఖలోనూ ఖాళీలు ఎక్కువగా ఉన్నాయని వాటిని పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. అభివృద్ధి పనులు చేసుకోవడానికి సర్పంచులకు చిల్లిగవ్వ ఇవ్వకపోతే పనులు ఎలా జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లాయర్ షేక్షావలి, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు గుర్రం దేవేంద్రప్ప, టిడిపి సీనియర్ నాయకులు శివలింగ, హనుమంతు, గుర్రం అనిల్, ఎస్.కె జహీర్, కొండ రామాంజనేయులు, గురు గోపాల్, గౌతం, గడ్డం నాగరాజు, రఘు, దాసరి కృష్ణ పాల్గొన్నారు.


గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న వైకుంఠం మల్లికార్జున చౌదరి

జాతీయ రహదారి రూటు మార్పు చేయాలి

- న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించిన బాధితులు

ప్రజాశక్తి - ఆదోని

జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్మాణం వల్ల అధికారుల సమన్వయం లోపం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదోని శివారు ప్రాంతంలో జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్మాణం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని భూమి కోల్పోతున్న బాధితులు నాగరాజు, వెంకట సత్య సాయి, అజీజ్ అహ్మద్, సర్దార్ నియాజ్, నాగరాజు, కృష్ణయ్య, కాలందర్ రవీంద్రతో పాటు మరో 30 మంది బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బైపాస్ రహదారి వల్ల భూమి కోల్పోతున్న వెంకటాద్రి ఎస్టేట్‌లో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బాధితులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఏళ్ల కాలం నాటి మాస్టర్ ప్లాన్, ప్రస్తుత అసంతృప్తిగా ఉన్న బైపాస్ రహదారి కాకుండా అలైన్మెంట్ మార్పులు చేసి నివాసాలు మధ్య జాతీయ రహదారి నిర్మించడం అన్యాయమన్నారు. 9 లేఅవుట్ ఎస్టేట్‌ల గుండా జాతీయ రహదారిని నిర్మించడం వల్ల భూములు కోల్పోయి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ లేఅవుట్ ప్లాన్లలో ఎక్కడ కూడా జాతీయ రహదారి బైపాస్ రోడ్డు ఉన్నట్లు అందులో పొందుపరచలేదన్నారు. ఇంటి నిర్మాణం కోసం రూ. లక్షలు పెట్టి కొను గోలు చేసి ప్లాట్లు కొన్నామన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా తమ ప్లాట్లు మీదుగా జాతీయ రహదారి నిర్మిస్తున్నట్లు పెగ్ మార్క్ వేశారని తెలిపారు. ఇప్పటికే ఇల్లు కొందరు నిర్మించుకున్నారని, అలైన్మెంట్ మార్పు చేయాల్సిన అవసరం ఏమిటని అన్నారు. ఇప్పటికే ఉన్న బైపాస్ మీదుగా జాతీయ రహదారి నిర్మిస్తే ప్రజాధనం దుర్వినియోగం కాదని అన్నారు. భూమి కోల్పోతున్న తాము కోర్టును అలైన్మెంట్ మార్పుపై ఆశ్రయించినట్లు తెలిపారు. జాతీయ రహదారి అధికారులు ఆర్‌టి యాక్ట్‌పై లేఅవుట్ ప్లాట్ లలో రోడ్డు నిర్మాణం జరపడం లేదని తమకు తప్పుడు సమాచారం ఇచ్చారని దీనిపై కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నేషనల్ హైవే అధికారులు పునరాలోచించుకొని అలైన్మెంట్ మార్పు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. పైసా పైసా కూడా పెట్టి లే అవుట్ ఎస్టేట్లోనే స్థలాలు కొనుగోలు చేశామని కొందరి స్వార్థం వల్ల నష్టపోవాల్సి వస్తుంద ని వారు ఆవేదన చెందారు. న్యాయం చేయాలని కలెక్టర్ ,ఎమ్మెల్యే నేషనల్ హైవే అథారిటీ అధికారుల దృష్టికి సమస్యల తీసుకొని వెళ్లిన సరైన సమాధానం చెప్పడం లేదన్నారు.




హైవే రోడ్డుకు అడ్డంగా ఉందన్న ఉన్న ఇల్లు ఇదే

ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి

- ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రసూన

ప్రజాశక్తి - చిప్పగిరి

ఆల్బెండజోల్ మాత్రలను ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాలు ఉన్న వారందరూ కూడా తప్పనిసరిగా వేయించుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రసూన, ఏఎన్ఎం సువర్ణ సూచించారు. మంగళవారం జాతీయ నులి పురుగులు నివారణ కార్యక్రమంలో భాగంగా నేమకల్లు గ్రామంలోని ఎస్సీ కాలనీలోని అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి టీచర్ బాల రంగమ్మ ఆధ్వర్యంలో పిల్లలకు మాత్రలు ను వేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. వైసిపి నాయకులు మోహన్ ఆయా ఆదిలక్ష్మి పాల్గొన్నారు. మండలంలోని అనేక గ్రామాలలోని పాఠశాలల్లో నులి పురుగు వారోత్సవాల్లో భాగంగా 5801 ఆల్బెండజోల్ మాత్రాలను వేయడం జరిగిందని ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ జమీల్ అహ్మద్ విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండవ విడత వేయించుకోలేనివారు ఈనెల 18న తప్పనిసరిగా వేయించుకోవాలని కోరారు. వైద్యాధికారి పార్వతమ్మ, సిహెచ్ఓ వెంకటేశ్వర్లు, సూపర్వైజర్ పద్మావతి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **దేవనకొండ:** జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా దేవన కొండ పి.హెచ్.సి పరిధిలోని కేజీబీవీ నందు ఆల్బెండజోల్ 400 ఎంజి మాత్రలను వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ భాస్కర్, వైద్య అధికారి డాక్టర్ రేష్మ, సిహెచ్ఓ భాగ్యలక్ష్మి, హెల్త్ ఎజుకేటర్ ఈశ్వరయ్య, సూపర్వైజర్స్ హనుమంతమ్మ, ఉమాబాయి, రామ్మోహన్, శ్రీధర్, ఎం ఎల్‌హెచ్‌పి మంజు భార్గవి, ఏఎన్ఎం వెంకటమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. **కోసిగి రూరల్ :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఎంఎల్పిహెచ్ఓ యామిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత సమస్య వస్తుందన్నారు. దీని నివారణకు తప్పనిసరిగా మాత్రలు వేయాలన్నారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల వయసున్న పిల్లలకు అరమాత్ర మధ్యాహ్నం భోజనం తర్వాత ఇచ్చి చప్పరించేలా చూడాలన్నారు. మాత్రల పంపిణీలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు కష్ణమూర్తి, వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


చిప్పగిరి : చిన్నారులకు మాత్రలను వేస్తున్న దృశ్యం


దేవనకొండ : చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం


కోసిగి రూరల్ : చిన్నారులకు మాత్రలను వేస్తున్న దృశ్యం


కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న ఎన్టీఆర్ అభిమానులు

ఆదోనిలో ఎన్టీఆర్ అభిమానుల సంబరాలు

ప్రజాశక్తి - ఆదోని

సినీహీరో నందమూరి జూనియర్ ఎన్టీరామారావు నటించిన ఆర్ఆర్ఆర్ సినిమాలోని 'నాటు నాటు' పాటకు ప్రపంచంలో అత్యున్నత పురస్కారమైన ఆస్కార్ అవార్డు వచ్చిన సందర్భంగా ఆయన అభిమానులు ఆదోనిలో సంబరాలు చేసుకున్నారు. మంగళవారం రాత్రి మున్సిపల్ రోడ్ లో కేయం బిర్యాని ప్యారడైజ్‌లో కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించుకుం టూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీ రామారావు ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ ముజీబహమ్మద్ మాట్లాడారు. ఆర్ఆర్ఆర్ సినిమాకు పురస్కారం నటించడం పట్ల తెలుగు ఇండస్ట్రీకి ఎనలేని గుర్తింపు వచ్చిందన్నారు. మరింతగా జూనియర్ ఎన్టీఆర్ నటనపరంగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాన్స్ అధ్యక్షుడు చాంద్బాషా, తదితరులు ఉన్నారు.


పల్లె దొడ్డి గ్రామంలో మహిళల బోనాల ఊరేగింపు

గద్దె రాళ్ల దేవర ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- దేవనకొండ

మండల పరిధిలోని గద్దె రాళ్ల గ్రామములో మారమ్మ దేవర ఉత్సవాలు దేవాదాయ శాఖ కారునిర్వాణాధికారి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా పల్లె దొడ్డి గ్రామంలో గ్రామస్తులు సుంకులమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలు బోనాల్లో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు. అదేవిధంగా మండలంలోని నేల తలమర్రి గ్రామంలో సుంకులమ్మ దేవర ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

టిబిపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని పట్టణంలోని హనుమాన్ నగర్‌లోని యుపీహెచ్‌సీ, షరాఫ్ బజార్, ఏజేనగర్ మ్యాక్ సెంటర్లలో డాక్టర్ షేకూన్ బాను, డాక్టర్ వినోద్ కుమార్, ఎంపిహెచ్ఎస్ బాబురాజు ఆధ్వర్యంలో మంగళవారం టిబి వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిబి రోగులను పరీక్షించి వారికి మాక్ సెంటర్ నుంచే మందులు ఇస్తారన్నారు. రెండు వారాలపాటు దగ్గు ఉన్నట్లయితే టిబిగా అనుమానించాలన్నారు. టిబి ఉన్న వ్యక్తికి ఉదయం సాయంత్రం జ్వరం వస్తూ ఉంటుందన్నారు. బరువు తగ్గడం, శాస తీసుకోవడంలో కష్టంగా ఉండటం, రక్తపు ఛారలతో కూడిన గళ్ల పడటం తదితర లక్షణాలు ఉన్న వారు ఉదయం తీసిన గళ్లను తీసుకొస్తే నిర్ధారణ కోసం పరీక్షకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీబిహెచ్‌వీలు లలితమ్మ, మనో రంజని దేవి, ఎఎన్ఎంలు, ఆశాలు, టీబీ రోగులు పాల్గొన్నారు.


సూచన చేస్తున్న బాబు రాజు

జోహరాపురంలో లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి - నందవరం

మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో పశు సంవర్ధక శాఖ జిల్లా పశు గణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రాజశేఖర్ కార్య నిర్వహణ అధికారి ఉమ్మడి కర్నూల్ జిల్లా పశు గణ అభవృద్ధి సంస్థ రైతులని ఉద్దేశించి మాట్లాడుతూ నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులని కావున దూడలను మొదటి మూడు నెలల పాటు పశువైద్యుల సహాయంతో జాగ్రత్తగా కాపాడుకోవాలని, అలాగే పశుసంవర్ధక శాఖ వారు నూతనంగా ప్రవేశపెట్టిన లింగ నిర్ధారణ వీర్యాన్ని ఉపయోగించి, తమ పశువులకి ఎద సూదులు వేయించు కోవాలని, తద్వారా 90 శాతం పెయ్య దూడలనే పొందవచ్చన్నారు. అనంతరం దూడలను నిర్వహణ భాగా చూసుకున్న మొదటి ముగ్గురు రైతులకి బహుమతులు ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్రమణ్యేశ్వర ఆచారి, సహాయ సంచాలకులు ప్రాంతీయ పశువైద్యశాల ఎమ్మిగనూర్ పశువైద్యులు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ కె ఉషారాణి, డాక్టర్ హేమంత్, డాక్టర్ జె నరేంద్రనాథ్ రెడ్డి, గిరిప్రసాద్, జె.వి.వో, రైతులు పాల్గొన్నారు.


లేగ దూడల పెంపకాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రాజశేఖర్

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాం

- సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య

ప్రజాశక్తి - మంత్రాలయం

వేసవి కాలంలోనే కాదు ఎప్పుడూ తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టామని గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య తెలిపారు. మంగళవారం బోరు మరమ్మత్తు చేయించి కాలనీ వాసులకు తాగునీటి సరఫరా చేయిం చారు. మండల కేంద్రమైన మంత్రాలయంలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో గత మూడు రోజులుగా బోరు పనిచేయకపో వడంతో గ్రామ పంచాయతీ ద్వారా కాలనీకి ట్యాంకర్ ద్వారా నీరు అందించారు.

ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం, ఆదివారాలు పని వారు రాక పోవడం, సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ఉన్నందున ఆలస్యం జరగడంతో మంగళవారం బోరు రిపేరు చేయించడం జరిగిందన్నారు. గతంలో కూడా ఎలాంటి నీటి సమస్య లేదని పేర్కొన్నారు. తుంగభద్ర నదిలో నుండి పైపు లైన్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల సహకారంతో వేసవిలోనే కాదు మంత్రాలయంలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు.


బోరుకు మరమ్మతు చేస్తున్న దృశ్యం

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండల కేంద్రమైన గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజ్ఞ వికాసం పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, ఇన్చార్జి హెచ్ఎం అయ్యస్వాములు హాజరై టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన ప్రశ్న పత్రాన్ని విడుదల చేశారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినంద నీయమని ఉపాధ్యాయులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వీరన్న, మండల సహాయ కార్యదర్శి సలీం,పాఠశాల అధ్యాపక బృందం గుమ్మల బాబు, భాస్కర్,విజయ్ కుమార్,అమానుల్లా బేగ్, ఎస్ఎఫ్ఐ నాయకులు చిరంజీవి, మోహన్,చత్రపతి,అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రశ్నాపత్రాన్ని విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఇన్ఫ్లూఎంజా వ్యాధిపై అవగాహన ర్యాలి

ప్రజాశక్తి - ఆదోని

ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఇన్ఫ్లూఎంజా (హెచ్3ఎన్2) వ్యాధిపై ఆదోని పట్టణంలో అవగాహన కల్పించారు. మంగళవారం పట్టణంలో మాస్కులు, కరపత్రాలు పంచి చైతన్యం చేశారు. ఈ సందర్భంగా ఐఎంఎ అసోసియేషన్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ గోపీనాథ్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ హరీష్, అధ్యక్షురాలు డాక్టర్ ఉషారావు మాట్లాడారు. హెచ్3ఎన్2 దేశంలో ఎక్కువగా వ్యాపిస్తోందన్నారు. గాలి ద్వారా వ్యాప్తి చెందే వ్యాధి కనుక మాస్కులు ధరించడం, గుంపుల్లో ఉండకూడదని, ఎక్కడబడితే అక్కడ ఉమ్మి వేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కిరణ్ కుమార్, ఈసీ మెంబర్ డాక్టర్ రఘునాథ్, లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ధర్మారెడ్డి, రీజియన్ ఛైర్మన్ ప్రసాదరావు, ఈసీ మెంబర్లు, వనపరాజు, గోవింద రాజమూర్తి, గోవిందరావు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పురుగు మందులపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్వి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో పిఐ కంపెనీ ఆధ్వర్యంలో పురుగు మందుల వాడకంలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు, మెళకువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మండల వ్యవసాయ అధికారి శివ శంకర్, పిఐ కంపెనీ రాయలసీమ మార్కెటింగ్ మేనేజర్ నాగార్జున రెడ్డి హాజరై రైతులకు పురుగు మందుల వాడకంపై వివరించారు. 65 మంది రైతులు, పిఐ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దేవాలయం హుండీ చోరీ

ప్రజాశక్తి - ఆలూరు

మండల పరిధిలోని మొలగవల్లి, జోహారాపురం గ్రామాల మధ్య ఉన్న నౌనేపాటయ్య దేవాలయంలో ఉన్న హుండీని గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి లూటీ చేశారు. మంగళవారం ఇరు గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై డాక్టర్ నాయక్ పోలీసు బృందంతో వెళ్లి దేవాలయం అవరణాన్ని పరిశీలించారు. ఆలయంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్థులకు సూచించారు. రాత్రి వాచ్ మెన్‌ను ఏర్పాటు చేయడానికి మొలగవల్లి, జోహారాపురం గ్రామ సర్పంచులు మోహన్ రాజ్, నెల్లూరప్పలు ముందుకు రావడంతో ఎస్సై కూడా వారికి సహకారం అందిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో అట్టేకల్ మాణిక్య,మలబోది నాగేష్,ఎర్రిస్వామి,రాజశేఖర్, గోపాల్‌లు పాల్గొన్నారు.


హుండీ ని పరిశీలిస్తున్న ఎస్ఐ నాయక్





సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైలం దేవస్థాన ఇఒ లవన్న

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు - నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వీటికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించరని అధికారులు చెబుతున్నారు..

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. వీటి కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఏడాది కూడా ఉమ్మడి కర్నూలు జిల్లా ఆధారంగా ఇంటర్ పరీక్షలను నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. కర్నూలు జిల్లాలో మొత్తం 73 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 23,610 మంది ప్రథమ సంవత్సర విద్యార్థులు, 26,057 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. నంద్యాల జిల్లాలో మొత్తం 51 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 12,178 మంది ప్రథమ సంవత్సర విద్యార్థులు, 14,792 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా పత్రాలను 44 పోలీస్ స్టేషనల్లో భద్రంగా భద్రపరిచారు. మొత్తం 17 పరీక్ష కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించగా అందులో కర్నూలు జిల్లాలో 12 కేంద్రాలు, నంద్యాల జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. 124 పరీక్ష కేంద్రాల్లో సిసి కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. 17 రూట్లలో విద్యార్థుల సౌకర్యార్థం ఆర్‌టిసి బస్సులను నడపనున్నారు. ఉదయం 8.30 నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రంలోపలికి అనుమతిస్తారు. 9 గంటల వరకూ మాత్రమే అనుమతివ్వనున్నారు. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతించరు. పరీక్షలను పర్యవేక్షించేందుకు ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్లు, 12 సిట్టింగ్ స్క్వాడ్లను కూడా ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. పరీక్ష ముగిసిన తరువాత మధ్యాహ్నం 12 గంటలకు సమాధాన పత్రాలను సేకరించి సరైన రీతిలో ప్యాకింగ్ చేసి సంబంధిత పోస్టు ఆఫీసులకు చేరేలా చర్యలు తీసుకోనున్నారు. పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్లకు కూడా ఫోన్లను అనుమతించడం లేదు. వారికి ఇంటర్మీడియట్ బోర్డు నుంచే బేసిక్ ఫోన్లను అందజేయనున్నారు.

పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం : డివిఇఒ సునీత

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



నేటి నుండి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని డివిఇఒ సునీత తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నేటి నుండి జరిగే ఇంటర్ పరీక్షలు ఏప్రిల్ 4న ముగుస్తాయన్నారు. పరీక్షల నిర్వహణకు 51 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారన్నారు. జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం విద్యార్థులు 12,178 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 14,792 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. పరీక్ష ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వుంటుందన్నారు. 8.30 గంటలకల్లా విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలని, ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించబోరని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, 144 సెక్షన్ విధిస్తున్నట్లు తెలిపారు. చుట్టు పక్కల జిరాక్స్ సెంటర్లు, నెట్ సెంటర్లు మూసేయాలని యజమానులకు సూచించారు.

పాదయాత్రికులకు అన్ని ఏర్పాట్లు

- శ్రీశైలం దేవస్థానం ఇఒ లవన్న

- ఉగాది మహోత్సవాలపై స్వచ్ఛంద సంస్థలతో సమన్వయ సమావేశం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రానికి పాదయాత్రగా వస్తున్న భక్తులకు క్షేత్ర పరిధిలో మార్గమధ్యలో అన్ని ఏర్పాట్లను దేవస్థానం కల్పిస్తుందని ఇఒ లవన్న తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుండి 23వ తేదీ వరకు శ్రీశైలం క్షేత్రంలో జరగనున్న ఉగాది మహోత్సవాలపై కర్ణాటక, మహారాష్ట్ర స్వచ్ఛంద సంస్థలు, పాదయాత్ర భక్త బృందాలతో దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న మంగళ వారం స్థానికపరిపాలన భవనంలో రెండవ సారి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ పాదయాత్రికులు సేద తీరేందుకు చలువ పందిల్లు, మంచినీరు, అల్పాహారం అందిస్తామన్నారు. వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్వచ్ఛ శ్రీశైలంలో భాగంగా బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధించినట్లు చెప్పారు. కావున భక్తులందరూ దేవస్థానం ఏర్పాటు చేసిన సౌచాలయాలను ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలని స్వచ్ఛంద సంస్థలకు సూచించారు. ఉగాది మహోత్సవాలలో కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన స్వచ్ఛంద సేవకుల సేవలను వినియోగించు కుంటామని తెలిపారు. వీరి సేవలను స్వామివారి ఆలయం ముఖ మండపం, నంది మండపం, ధ్వజస్తంభం, అమ్మవారి ఆలయం, ఉచిత దర్శనం, శీఘ్ర, అతి శీఘ్ర దర్శనం, ఉచిత క్యూలైన్, భక్తులు వేచి ఉండే క్యూ కాంప్లెక్స్, పుష్కరిణి, గంగాభవాని, స్నాన ఘట్టాలు, పాతాళ గంగ, హటకేశ్వరం, సాక్షి గణపతి, లడ్డు ప్రసాదాల విక్రయ కేంద్రాలు, అన్నదానం, వైద్యశాల, పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం, తాత్కాలిక సమాచార కేంద్రాలు వంటి పలు చోట్ల వారి సేవలను వినియోగించాలని కోరారు. స్వచ్ఛంద సేవా సంస్థలకు సేవలను వినియోగించు కునేందుకు పారదర్శకత కోసం లాటరీ పద్ధతిలో సేవలు అందించాల్సిన కేంద్రాలను కేటా యించారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే పట్టాలపై లారీ పరుగులు



రైలు పట్టాలపై వెళ్తున్న లారీ

ప్రజాశక్తి - బేతంచెర్ల

గుంటూరు-గుంతకల్ రైల్వే ట్రాక్ డబుల్ లైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో భాగంగా బేతంచెర్ల మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ సమీపంలో రైల్వే పట్టాలపై లారీ పరుగులు పెటింది. ఇందుకు కారణం లారీ టైర్లకు బదులుగా రైల్వే భోగిలకు ఉండే చక్రాలు పెట్టడం. దీంతో పట్టాలపై లారీ వెళ్తుండడం చూపరులను ఆకట్టుకుంటుంది. రైల్వే పనులకు అవసరమైన వస్తువులను వర్కర్లకు అందజేసేందుకు వీలుగా రైల్వే ఇంజనీర్లు ఈ లారీని రైల్వే ట్రాక్‌పై నడిచే విధంగా తయారు చేశారు.

జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - చాగలమర్రి : చాగలమర్రి పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి సాయిచరన్ జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కోటయ్య మంగళవారం తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ నెల 8న ఆళ్లగడ్డ వైపిపిఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంపిక పోటీల్లో విద్యార్థి ప్రతిభ కనబరచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడని చెప్పారు. ఈనెల 28 నుంచి ఛత్తీస్గఢ్ రాష్ట్రం బిలాయ్ నగరంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఎపి తరపున విద్యార్థి పాల్గొననున్నాడని తెలిపారు. విద్యార్థి ఎంపికకు కృషి చేసిన పీడీ దాదాపీర్, పీఈటీ భారతిలను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థితో పాఠశాల యాజమాన్యం

చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోండి

- రక్తహీనత నివారణకు మెరుగైన చికిత్స

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

- ఘనంగా జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో రక్తహీనతను గుర్తించి నివారణకు మెరుగైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ విద్య, వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని ఎపి మోడల్ స్కూల్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు కలెక్టర్ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనతను గుర్తించడంతో పాటు కంటి చూపు, చెవుడు, చెవిలో చీము కారడం, దంత సంరక్షణకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలను మెడికల్ అధికారులు, వైద్య సిబ్బంది క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. రక్తహీనతకు ప్రధాన కారణమైన నులి పురుగులను నివారించేందుకు ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ మాత్రలను తప్పక తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న 3,99,942 మంది పిల్లలందరికీ నులిపురుగుల నివారణ ఆల్బెండజోల్ మాత్రలను మింగించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖధికారి డా.ఆర్ వెంకటరమణ మాట్లాడుతూ ఆల్‌బెండజోల్ మాత్రలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి వేసుకోవడం వలన విద్యార్థుల జీర్ణాశయంలో అన్ని రకాల నులిపురుగులు, వాటికి సంబంధించిన గుడ్లు నశిస్తాయన్నారు. మధ్యాహ్నం భోజనం అనంతరం జిల్లా కలెక్టరు విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు స్వయంగా వేశారు. పాఠశాలలకు గైర్హాజరైన విద్యార్థులకు ఈనెల 18వ తేది వేస్తామని జిల్లా కో ఆర్డినేటర్ డా. ఎన్.కాంతారావు నాయక్ కలెక్టర్‌కు నివేదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రారెడ్డి, డిఇఒ అనురాధ, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డా.అంకిరెడ్డి, డా.వినయ్, డా.సిసిలియా, పాఠశాల ప్రిన్సిపల్ ఫర్హానా, వార్డు కౌన్సిలర్ చంద్ర శేఖర్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** జాతీయ నులి పురుగు నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు, అంగన్వాడీ కేంద్రాలలోని చిన్నారులకు హెల్త్ సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఎంఇఒ బాలాజీ నాయక్, జడ్పిటిసి, ఆయా గ్రామాల్లో సర్పంచులు. ఎంపిటిసిలు మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని మండల వైద్యాధికారిని సూపర్వైజింగ్ చేశారు. రుద్రవరంలోని అంగన్వాడీ కేంద్రంలో వైద్యాధికారిని నాగలక్ష్మి దేవి కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం నాగలక్ష్మి దేవి మాట్లాడుతూ మండలంలో మొత్తం పిల్లలు, విద్యార్థులు 7014 ఉండగా అందులో 6983 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించామన్నారు. మిగిలిన వారికి ఈ నెల 18న మింగిస్తామన్నారు. హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **రుద్రవరం :** మండలంలోని నరసాపురం ఆలమూరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో చిన్నారులకు ఆల్బెండా జోల్ మాత్రలను పంపిణీ చేశారు. నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ బాబు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో 1404 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను ఇచ్చామన్నారు. ఆలమూరు పిహెచ్‌సి డాక్టర్ అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రం పరిధిలో 6,670 మంది చిన్నారులు ఉండగా 6,402 చిన్నారులకు మాత్రలను అందజేశామన్నారు. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** ఆత్మకూరు పట్టణంలోని **(మిగతా 6వ పేజీలో..)**



విద్యార్థినికి అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్



నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్మికులు

ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఐవిఆర్ రెడ్డి

ప్రజాశక్తి - డోన్

ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ డోన్ డిపో సెక్రటరీ ఐవిఆర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర జెఎసి అమరావతి కమిటీ పిలుపుమేరకు 6వ రోజు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 పిఆర్‌సి బకాయిలు ఇవ్వాలని, డిఎ అరియర్స్ మొత్తం చెల్లించాలని, 2022-2023 డిఏలను ప్రకటించాలని, సర్వీస్ కండిషన్లను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏడిసిడి చంద్రుడు, ఎంఎస్ భగవాన్, బి.సురేష్, ఆలీ సాహెబ్, టి.బందయ్యా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీల్లో గురురాజా విద్యార్థికి పతకం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణానికి చెందిన శ్రీగురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థిని ఎస్.నీరజ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపి పతకం సాధించిన్లు పాఠశాల డైరెక్టర్ పి.షేక్షావలి రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పాఠశాలలో విద్యార్థినిని ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు విశాఖపట్నంలోని ఎలమంచిలో వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన 40వ సబ్ జూనియర్ 5వ కేడట్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో తమ విద్యార్థిని ఎస్.నీరజ సత్తా చాటి సిల్వర్ మెడల్ దక్కించుకుందని తెలిపారు. రాష్ట్రస్థాయిలో సిల్వర్ మెడల్ సాధించడం తమ పాఠశాలకు గర్వకారణమని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎస్.నీరజ పతకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థిని ఎస్.నీరజను, కోచ్‌ను అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్ షేక్షావలి రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని చిన్న కందుకూరు క్రాస్ రోడ్ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకుడిగా పని చేస్తున్న మోహన్ రెడ్డి (41) మృతి చెందాడు. వివరాలు.. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్ రెడ్డి విధి నిర్వహణలో భాగంగా ఉదయం పాత కందుకూరు (చిన్న కందుకూరు) నుంచి ఆళ్లగడ్డకు మోటార్ సైకిల్‌పై వస్తుండగా జాతీయ రహదారిపై పట్టణంలోకి ప్రవేశిస్తుండగా ఏవి గోదాముల వద్ద ఎదురుగా వస్తున్న కర్నూల్ డిపోకు చెందిన బస్సు కడపకు వెళ్తుండగా ఢీకొన్నాడు. తలకు తీవ్ర గాయమయింది. చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ మరణించాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా ఈ ప్రమాదం జరిగిన ప్రాంతంలో అనేక ప్రమాదాలు, పదుల సంఖ్యలో ప్రజల ప్రాణాలు పోయాయి.. సుద్ధపల్లె, చాగలమర్రి వైపు నుంచి వచ్చే వాహనాలు ఆళ్లగడ్డలోకి ప్రవేశించాలంటే తప్పనిసరిగా 100 మీటర్ల దూరం వరకు జాతీయ రహదారిపై వచ్చే వాహనాలకు ఎదురుగా వెళ్లాల్సి వస్తుంది.. దీంతో అనేక ప్రమాదాలు చోటు చేసు కుంటున్నాయి.. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బంక మోహన్ రెడ్డి మృతి పట్ల ఉపాధి హామీ పథకం ఏపీవో గణేష్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



మృతి చెందిన మోహన్ రెడ్డి

స్కీం కార్మికులు పోరాటానికి సిద్ధం కావాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

స్కీం వర్కర్లు ప్రభుత్వంపై పోరాడడానికి సిద్ధం కావాలని ఎపి గవర్నమెంట్ స్కూల్ స్వీపర్స్ అండ్ ఆయా యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి శివ బాలకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని కార్యాలయంలో స్కీం వర్కర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరలకు అనుగుణంగా స్కీం వర్కర్లకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేస్ యాప్‌ను రద్దు చేయాలన్నారు. స్కీం కార్మికులందని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఈ నెల 17న నిర్వహించే చలో అసెంబ్లీ, మహాధర్నాలో స్కీం కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం నాయకురాలు సావిత్రి, లక్ష్మీదేవి, రామ లచ్చమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివ బాలకృష్ణ

వైభవంగా సేవాలాల్ మారెమ్మ జాతర

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని రాళ్ల కొత్తూరు తండాలో సేవాలాల్ మారెమ్మ జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ జాతరలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసిపి నియోజకవర్గ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిలకు వైసిపి నాయకులు, తండావాసులు ఘన స్వాగతం పలికారు. వీరు అమ్మవారినీ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తమ్మడపల్లె గ్రామపంచాయతీ సర్పంచ్ యన్నం వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచ్ మధు నాయక్, ఈశ్వర నాయక్, ఉమ్మడి జిల్లాల ఎంపిటిసిల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాలరెడ్డి, నాయకులు గోవిందు నాయక్, లక్ష్మానాయక్, దేవా నాయక్, వెంకటేష్ నాయక్, బాలుడు నాయక్, తుకారాం నాయక్, కుమార్ నాయక్, మల్లిరెడ్డి, శివుడు, సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

మాజీ ఎమ్మెల్యే బిసి ప్రత్యేక పూజలు : సేవాలాల్ మారెమ్మ జాతరలో మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తండాకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డికి టిడిపి నాయకులు, కార్యకర్తలు, తండావాసులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ నాయక్, జిల్లా అధ్యక్షులు కృష్ణా నాయక్, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, వెంకటరాముడు నాయక్, గ్రామ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి



మహిళలు రూపొందించిన షర్టును పరిశీలిస్తున్న డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

- డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆకాంక్షించారు. మంగళవారం డోన్ పట్టణంలోని ఇందిరానగర్‌లో ఉన్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని, మహిళలు తయారు చేసిన షర్టును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలు ఒక షర్ట్ తయారు చేసి హైదరాబాద్‌కు పంపగా వారి నుండి 150 షర్టుల కోసం ట్రయల్ ఆర్డర్లు వచ్చాయని తెలిపారు. మహిళలు చక్కగా షర్టులను రూపొందిస్తే మరెన్నో అవకాశాలు లభిస్తాయని అన్నారు. శిక్షణ పొందిన ప్రతి మహిళ ఇటువంటి అవకాశాలను సద్వినియం చేసుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణ కేంద్రంలో మహిళలకు కావాల్సిన కొన్ని మౌలిక వసతులు చైర్మన్ దృష్టికి తీసుకుపోగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు.

ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు

ప్రజాశక్తి - రుద్రవరం

విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఎంఇఒ రామసుబ్బయ్య తెలిపారు. మంగళవారం రుద్రవరంలోని ఆదర్శ పాఠశాలను ఆయన సందర్శించారు. ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వర్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఇఒ మాట్లాడుతూ 10వ తరగతి పిల్లలకి కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. బాగా చదువుకుని ఎదగాలని, మండలానికి మంచి పేరు తేవాలని, 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, కిరణ్ కుమార్, సతీష్, సిఆర్‌పిలు, శేఖర్, రామయ్య, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.





అన్నదానం చేస్తున్న దృశ్యం

కన్నడిగులకు అన్నదానం

ప్రజాశక్తి - నందికొట్కూరు

శ్రీశైలానికి కాలినడకన వెళ్తున్న కర్ణాటక భక్తులకు నందికొట్కూరు పట్టణంలో సీడ్స్ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ డీలర్స్ అసోసియేషన్ (చక్రపాణి) ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మకూరు రోడ్డులోని జమ్మిచెట్టు దగ్గర వినాయక స్వామి దేవాలయంలో దాతల సహాయ సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కో- ఆప్షన్ సభ్యులు కేశవరెడ్డి శ్రీనివాస రెడ్డి, సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సి.విజయ శేఖర, వ్యవసాయ అధికారిని బి.శ్రావణి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కిరణ్ కుమార్ రెడ్డి, కురువ శ్రీను, విఆర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో తొలగించిన పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఏఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. ఏఐటియుసి పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఫిబ్రవరి 15న శానిటేషన్ వర్కర్లను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం హేయమైన చర్య అన్నారు. తక్షణమే వీరిని విధులకు తీసుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్లు సుశీలమ్మ, వెంకట రమణమ్మ, నాగేంద్రమ్మ, సావిత్రి, గోవిందపల్లి రాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో మోడల్ విద్యార్థినికి రెండవ ర్యాంకు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని మోడల్ స్కూల్ విద్యార్థిని నూర్జహాన్ ఈఈ (ఎడ్యుకేషనల్ ఏపి ఫణి) టెస్ట్‌లో జిల్లా స్థాయిలో రెండవ ర్యాంకును సాధించినట్లు ప్రిన్సిపల్ రామలక్ష్మి మంగళవారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 7, 10వ తరగతి విద్యార్థుల కోసం ఎడ్యుకేషనల్ ఏపి ఫణి అనే సంస్థ ప్రతి సంవత్సరం ఆన్లైన్ టెస్టును నిర్వహిస్తుంది. అందులో భాగంగా 2022 జనవరి 31న నిర్వహించిన టెస్టులో దాదాపుగా 51 వేల మంది విద్యార్థులు పాల్గొనగా బనగానపల్లె మోడల్ స్కూల్ ఏడవ తరగతి విద్యార్థిని నూర్జహాన్ జిల్లాస్థాయిలో రెండవ ర్యాంకును సాధించింది. ఈ విద్యార్థినికి నాలుగు వేల రూపాయల నగదు పారితోషికంతో పాటు షీల్డ్‌ను విజయవాడ విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని నూర్జహాన్‌ను పాఠశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు విద్యార్థులు అభినందించారు.



చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోండి

(5వ పేజీ తరువాయి..) వెంగళరెడ్డి నగర్ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా మాట్లాడారు. జిల్లా సమాచార శాఖ అధికారిని డాక్టర్ ప్రభావతి, ఆత్మకూరు కమిషనర్ శ్రీనివాసరావు, అర్బన్ మెడికల్ ఆఫీసర్ మహమ్మద్ బేగ్, హెల్త్ ఎడ్యుకేషన్ ధనలక్ష్మి, ఏఎన్ఎం సుబ్బలక్ష్మి, లక్ష్మీదేవి, ఆశా వర్కర్ గౌరీ తదితరులు పాల్గొన్నారు. **ఉయ్యాలవాడ :** విద్యార్థుల్లో ఉన్న రక్తహీనతను తగ్గించేందుకే ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నామని మండల వైద్యాధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. పాఠశాల ప్రిన్సిపల్ నూర్జహాన్, ఎంపిహెచ్‌సిఓ దస్తగిరి, హెల్త్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వాడాలని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలో వైద్యాధికారి డాక్టర్ శివ శంకరుడు, ఎంపిహెచ్ఈఓ నల్లగట్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నులి పురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అలాగే మండలంలోని నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బయన్న ఆధ్వర్యంలో నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ఆర్‌సిసి జిల్లా కో ఆర్డినేటర్ బత్తుల విజయకుమార్ మాట్లాడారు. ఉపాధ్యాయులు ప్రసాద్, నారాయణ, మురళి, ఏం ఎల్ హెచ్ పి రాజేష్, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, జల జీవన్ మిషన్ స్టార్ యూత్ అసోసియేషన్ ఐఈసి ఎక్స్పర్ట్ సుగాశెట్టి బాలయ్య పాల్గొన్నారు. **చాగలమర్రి :** చాగలమర్రి పట్టణంలో మంగళవారం ఆయా పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు నులిపురుగుల నివారణా మందులను పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు అంజలి, ఇమ్రాన్, ఎంఈవో అనురాధ, హెచ్ వెంకటమ్మ, సూపర్వైజర్ రామచంద్రుడు, హెచ్ఎం విజయలక్ష్మి, సిబ్బంది. పాల్గొన్నారు. **బేతంచెర్ల :** బేతంచెర్ల, మండలంలోని గోర్లగుట్ట, సిమెంట్ నగర్, బుగ్గానపల్లి తదితర గ్రామాలలో ఏఎన్ఎం అమల రామాంజనేయులు ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండల వైద్య అధికారి ఎన్ గాయత్రి, అస్లాం బేగ్, హెచ్ఎం శివకుమార్ స్వామి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. **గోస్పాడు :** గోస్పాడు జిల్లా పరిషత్ హై స్కూల్‌ను సందర్శించి డాక్టర్ గోపాల్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగదీష్ చంద్ర రెడ్డి విద్యార్థులకు ఆల్ బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. హెచ్ఎం బాలనాగిరెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు రమాదేవి, మహేశ్వరి, ఆశా కార్యకర్తలు హుస్సేనమ్మ, శివలక్ష్మి, సుమలత పాల్గొన్నారు.



పాములపాడు : అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న దృశ్యం



ఆత్మకూరు : మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఆసియా



రుద్రవరంలో..



ఉయ్యాలవాడలో..



బనగానపల్లెలో...



చాగలమర్రిలో...



బేతంచెర్లలో...



గోస్పాడులో మాట్లాడుతున్న దృశ్యం

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

పశువుల్లో వేసవికాలంలో వచ్చే గాలి కుంటు వ్యాధి నివారణకు రైతులు టీకాయిలు వేయించాలని బండి ఆత్మకూరు పశువైద్యాధికారి డాక్టర్ అనూష కోరారు. మంగళవారం మండలంలోని నారాయణపురం, పరమటూరు గ్రామాల్లో 900 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలి కుంటు వ్యాధిని సమూలంగా నిర్మూలించాలని, రైతులు సహకరించాలని కోరారు. పశు వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, ఎలాంటి సమస్యలు ఉన్నా సంప్రదించాలని సూచించారు. **పాములపాడు :** పశువులకు వ్యాధి రాకముందే నివారణ టీకాలు వేయించడం ఎంతో మేలని పశువైద్యాధికారి భాస్కర్ తెలిపారు. మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా 80 ఎద్దులు, 180 గేదెలు, 4 నెలలు దాటిన 80 దూడలకు ఉచిత టీకాలు వేశారు అనంతరం ఆయన పశువుల పట్ల వచ్చు వ్యాధులపై సూచనలు చేశారు.



బండి ఆత్మకూరు : పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న డాక్టర్ అనూష



పాములపాడు : పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న డాక్టర్ భాస్కర్

ఉగాదికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - పగిడ్యాల

ఉగాది పండగకల్లా జగనన్న కాలనీల్లో ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపిడిఒ వెంకటరమణ లబ్దిదారులకు సూచించారు. మంగళవారం పగిడ్యాల జగనన్న కాలనీలోని ఇండ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. లబ్దిదారులకు అవగాహన కల్పించి త్వరగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయిచాలని అసిస్టెంట్ ఇంజనీర్లకు ఆదేశించారు. పనులు పెండింగ్ లేకుండా ఎప్పకటికప్పుడు బిల్లులు జియోట్యాగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి పుల్లయ్య పాల్గొన్నారు.



పగిడ్యాలలో జగనన్న కాలనీలోని ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ



ఆల్బర్ట్ ఐన్ స్టీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నోబెల్ గ్రహీత ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జయంతి

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎం.వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన ఆల్బర్ట్ ఐన్‌స్టైన్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయుడు సుబ్బారాయుడు మాట్లాడుతూ ఐన్‌స్టీన్ 1879 మార్చి 14న జన్మించారన్నారు. అతను సాపేక్ష సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. సైద్ధాంతిక భౌతిక శాస్త్రానికి చేసిన సేవలకు, ఫోటో, విద్యుత్ ఫలితానికి 1921కి గాను భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని అందుకున్నాడని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివ ప్రసాద్, వెంకటేశ్వర్ గౌడ్, వెంకట రమణ, లక్ష్మయ్య, చంద్రశేఖర్ గౌడ్, సుబ్బారెడ్డి, అల్లిపీరా, మధుసూదన్ రెడ్డి, మద్దిలేటి, శ్రీనివాసులు, భూకాంతరెడ్డి, సురేష్, సుభాన్, జయసుబ్బారాయుడు, సంజీవరెడ్డి, ఆదినారాయణ, శివన్న, భారతి, శ్రీకళ, లక్ష్మి ప్రభావతి, లీలావతమ్మ, రామ్మూర్తి, ముని రాజు, మహేష్, అల్లిపీరా తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి : జడ్జి

ప్రజాశక్తి - ఆత్మకూర్

విద్యార్థినీ విద్యార్థులు, యువత చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆత్మకూర్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీ తేజ సాయి అన్నారు. మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని స్నేహ స్టడీ సర్కిల్ డీఎస్సీ కోచింగ్ సెంటర్ ఆవరణంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానంగా యువత వాహన ప్రమాదాలకు సంబంధించిన చట్టాలు, భూ చట్టాలు, మహిళలకు ఉన్న చట్టాలను తెలుసుకోవాలన్నారు. ఈ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో స్నేహ స్టడీ సర్కిల్ డైరెక్టర్ పి.ఆశ, న్యాయవాదులు శ్రీధర్, అడిగె హుస్సేన్ మియా, మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శ్రీ తేజ సాయి

మీ పిల్లలకూ ఇలాగే పెడతారా..?

- మధ్యాహ్న భోజనం నిర్వాహకులపై త్రిసభ్య కమిటీ ఆగ్రహం

ప్రజాశక్తి - పగిడ్యాల

'విద్యార్థుల హాజరు తగ్గట్లుగా భోజనం ఎందుకు చేయలేదు.. విద్యార్థులకు సగమే పెట్టి వారిని అర్ధాకలితో కడుపు మాడుస్తారా..? మీ పిల్లలకయితే ఇలాగే పెడతారా.. ' అంటూ మధ్యాహ్న భోజనం నిర్వాహకులు త్రిసభ్య కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పగిడ్యాలలోని మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం పథకాన్ని త్రిసభ్య కమిటీ సభ్యులు ఎంపిడిఒ వెంకటరమణ, ఎంఇఒ సుభాన్, తహశీల్దార్ భారతి తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనానికి 376 మంది విద్యార్థులు హాజరు వేస్తే 320 మందికి మాత్రమే భోజనం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత తేడా వంట చేసి విద్యార్థులకు ఆర్థాకలితో భోజనం పెట్టడం సరికాదన్నారు. విద్యార్థులకు సరిపడా భోజనం ఎందుకు వండలేదని నిర్వాహకులను ప్రశ్నించారు. పులిహోర కూడా రుచికరంగా లేదని అసహనం వ్యక్తం చేశారు. మీ ఇంటో పిల్లలకైతే ఇలానే భోజనం వండి పెడతారా అని మండిపడ్డారు. భోజనాన్ని రుచికరంగా నాణ్యతతో మెనూ ప్రకారం చేయాలన్నారు. రుచికరంగా చేయని పక్షంలో నోటీసులు ఇస్తామన్నారు. ఇక ముందు ఇలాంటివి జరిగితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా సరైన పద్ధతితో పెట్టాలని ఆదేశించారు.



మధ్యాహ్న భోజనం పథకాన్ని తనిఖీ చేస్తున్న త్రిసభ్య కమిటీ సభ్యులు



కమీషన్ ఏజెంట్ల విడిదికి తాత్కాలిక షెడ్లు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల టెక్కె వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి యార్డు ప్రారంభించినందున కమీషన్ ఏజెంట్ల విడిది కోసం తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. మార్కెట్ యార్డ్ సెక్రటరీ కల్పన, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్బారెడ్డిలతో కలిసి చైర్మన్ మార్కెట్ యార్డులో షెడ్ల నిర్మాణానికి మంగళవారం పరిశీలించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ మిర్చి క్రయ విక్రయాలు బాగా జరుగుతున్నాయని, క్వింటా ధర రూ.2,300 నుండి రూ.2500 వరకు పోతుందని తెలిపారు. గుంటూరు మార్కెట్ కంటే ఇక్కడే ధర బాగుందని, క్రయ విక్రయాలు ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ సిబ్బంది శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - కొత్తపల్లి

పంటల సాగులో ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం ఇంచార్జ్ సయ్యద్ భాష తెలిపారు. మంగళవారం మండలంలోని శివపురం గ్రామంలో రైతుల పొలాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతు తలారి లింగన్న మూడు ఎకరాల మునగ పంటను, దీంతోపాటు అంతర పంటలైన చిక్కుడు పంటను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు వేస్తున్న పంటలలో వ్యవసాయ పద్ధతిలో జీవామృతం, నీమాస్త్రం (వేప కషాయం) తయారీ విధానం వాడుకోవాలని వివరించారు. రైతులు పొలాల్లోనే వీటిని తయారు చేసుకోవచ్చన్నారు. జీవామృతంను వాడడం వల్ల భూమిలోని సూక్ష్మ జీవులకు ఆహారం, వాన పాముల ఎదుగుదలకు అవసరమైన ఆహారం లభిస్తుందన్నారు. వీటి వాడకం వల్ల భూమి సారవంతం అవుతుందని తెలిపారు. రసాయనిక ఎరువులైన యూరియా, డిఏపి వాడకం తగ్గించవచ్చన్నారు. వేప కషాయం వల్ల పంటను ఆశించే తెగుళ్లను, దోమపోటును, పురుగును నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌బికె విఏఏ మౌనిక, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది వెంకటేష్, సుమలత, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాస్వామ్యాన్ని అధికార పార్టీ ఖూనీ

ప్రజాశక్తి - నందికొట్కూరు

ప్రజా స్వామ్యాన్ని అధికార పార్టీ నేతలు ఖూనీ చేస్తున్నారనిబిజెపి నందికొట్కూరు నియోజకవర్గ ఇన్చార్జ్ కొండేపోగు చిన్న సుంకన్న పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నివాసంలో ఏపి బిజెవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ఆదేశాల మేరకు విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ, పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ నాయకులే ముచ్చుమర్రికి చెందిన బాలకృష్ణను దొంగ ఓటు వేయడానికి పంపించారని స్వయంగా బాలకృష్ణ చెల్లెలే చెప్పిందన్నారు. పోలింగ్ కేంద్రంలో పోలీసులు బాలకృష్ణను అదుపులోకి తీసుకున్నా ఎలాంటి విచారణ చేయలేదని, ఎమ్మార్వో కూడా ఎలాంటి విచారణ చేయకుండా రాత్రి 8 గంటల దాకా స్టేషన్ దగ్గర ఉంచగా వైసిపి నాయకులు వచ్చి విడిపించుకుని వెళ్లారన్నారు. సంబంధిత ఎస్ఐ, ఎంఆర్ఒపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శాస్త్రీయ సామ్యవాదం కారల్ మార్క్స్ లక్ష్యం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలలోనిసిపిఐ (ఎంల్) న్యూడెమొక్రసీ పార్టీ కార్యాలయంలో ఐఎఫ్‌టియు జిల్లా కోశాధికారి ఎస్.చౌడప్ప అధ్యక్షతన కార్ల్ మార్క్స్ 140వ వర్ధంతి సభను నిర్వహించారు. కార్ల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.శంకర్, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు రఫీ మాట్లాడారు. శాస్త్రీయ సామ్యవాదానికి మూలపురుషుడు కార్ల్ మార్క్స్ అన్నారు. మార్క్స్ రచించిన 'దాస్ కాపిటల్, కమ్యూనిస్టు ప్రణాళిక (కమ్యూనిస్టు మానిఫెస్టో) ప్రపంచ ప్రఖ్యాతిగాంచాయని తెలిపారు. సమావేశంలో ఆదర్శ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రఫీ, మధు, మద్దిలేటి, ఇర్ఫాన్, కాజామియా తదితరులు పాల్గొన్నారు.



కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి : పిడిఎస్‌యు

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని స్థానిక జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని పిడిఎస్‌యు జిల్లా సహాయ కార్యదర్శి కె.పవన్ విద్యాశాఖ ఉన్నతాధికారులను కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులకు విద్యానిలయాలు అయిన పరీక్ష కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా మాస్ కాపీయింగుకు పాల్పడుతున్నారని, విద్యాధికారులకు ఎన్నోసార్లు కంప్లైంట్ చేసినా వారు పట్టించుకోవడంలేదన్నారు. కొందరు ప్రైవేట్ కాలేజీల అజమాయిషితో మాస్ కాపీయింగ్ పాల్పడుతున్నారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి సెంటర్లపై నిఘా వేసి అలాంటి తప్పులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. **నందికొట్కూరు :** నందికొట్కూరులోని జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని పిడిఎస్‌యూ డివిజన్ కార్యదర్శి పి.మర్రిస్వామి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా మాస్ కాపీయింగుకు పాల్పడుతున్నారని, విద్యాధికారులకు ఎన్నోసార్లు కంప్లైంట్ చేసినా పట్టించుకోవడంలేదన్నారు. ఈ సారైనా ఉన్నతాధికారులు నిఘా పెట్టి అలాంటి తప్పులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న పిడిఎస్‌యు జిల్లా సహాయ కార్యదర్శి కె.పవన్